ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

కర్ణాటక వార్తలు
గురువారం 23 అక్టోబరు 2025



కోటి నజరానా కోసం.. సోలార్ పాట్లు..!

మైసూరులో ఏడు గ్రామాల మధ్య పోటీ



బెంగళూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సోలార్ వినియోగంలో సంపూర్ణత సాధిస్తే కోటి రూపాయల నజరానా లభిస్తుందనే ఆశతో మైసూరు జిల్లాలో పలు గ్రామాల మధ్య స్నేహపూర్వకమైన పోటీ నెలకొంది. ప్రస్తుత జనజీవనంలో పల్లె పట్టణం అనే తేడా లేదు. ప్రతిచోటా ప్రజలు విద్యుత్‌పైనే ఆధారపడ్డారు. మొబైల్ చార్జింగ్ నుంచి ఇంట్లో వెలుగులు నింపాలన్నా, ఫ్యాన్ తిరగాలన్నా, ఏసీ పనిచేయాలన్నా, రిఫ్రిజిరేటర్‌లు నిత్యావసరాలు నిల్వ చేసుకోవాలన్నా వీటన్నింటితోపాటు దేశ విదేశీ సమాచారంతో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ పొందాలన్నా టెలివిజన్‌లకు విద్యుత్ అవసరంగా మారిపోయింది. ఇలా ప్రతి మనిషి విద్యుత్ వాడకం లేకుండా ముందుకెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. ఇలాంటి తరుణంలోనే సంపూర్ణంగా సోలార్ వాడకం సాధ్యమైతే అటువంటి గ్రామాల అభివృద్ధికి కోటి రూపాయలదాకా కేంద్రం నుంచి నజరానా లభిస్తుందనే గ్రామపంచాయతీల మధ్య పోటీ తత్వం నెలకొంది.

● సోలార్‌లైట్, సోలార్ పంప్‌తోపాటు ప్రతి ఇంటికీ సౌరశక్తిని అమర్చుకోవడం, వ్యవసాయ పంప్‌సెట్లను సోలార్‌కు అనుసంధానం చేసుకోవడం ద్వారా సౌరశక్తిని ఎక్కువ ప్రమాణంలో వినియోగించుకునేందుకు గ్రామపంచాయతీలు సిద్ధమయ్యాయి. పోటీలో విజేతగా నిలిస్తే రూ.కోటి బహుమానం వస్తుందనే గ్రామపంచాయతీ పాలకులు ప్రజలను ప్రోత్సహిస్తున్నారు. గ్రామసర్పంచ్ వార్డు మెంబర్లు, అధికారులు, ఉద్యోగులు గడిచిన నాలుగు నెలలుగా సాహసమే చేస్తున్నారు. మరో రెండు నెలల్లో ఏ గ్రామానికి ఉత్తమ బహుమతి దక్కుతుందనేది తేలనుంది.

● కేంద్రప్రభుత్వం రెన్యూవబుల్ ఎనర్జీ మంత్రిత్వశాఖ దేశవ్యాప్తంగా మోడల్ సౌర గ్రామపథకం పోటీలను నిర్వహిస్తోంది. మైసూరు జిల్లాలో ఆరేడు గ్రామాలను ఎంపిక చేశారు. ఈ గ్రామాలలో ఉత్తమంగా సౌరశక్తిని వినియోగించుకునే గ్రామానికి కోటి రూపాయల ప్రోత్సాహకం లభించనుందని సెస్క్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సునిల్ తెలిపారు. ఇటీవల ప్రాంతీయ కమిషనర్ నేతృత్వంలో ఏర్పడిన కమిటీ మైసూరు జిల్లా పరిధిలోని పలు తాలూకాలను సందర్శించి 7 గ్రామాలను మోడల్‌గా ఎంపిక చేసింది. నాలుగు నెలలుగా సంబంధిత గ్రామాల ప్రజలకు చైతన్యం కలిగిస్తున్నారు. ప్రధానమంత్రి ఘర్ యోజన పథకం కింద ఇళ్లపైన సోలార్ ప్యానెల్‌ను అమర్చుకోవడం, పీఎం కుసుమ్ యోజన పథకం కింద వ్యవసాయ భూములలో సోలార్ పంప్‌లను ఏర్పాటు చేసుకోవడం, ప్రభుత్వ భవనాలు, సౌరశక్తి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగించుకోవడం వీధి దీపాలకు సోలార్ లైటింగ్, తాగునీటికి సోలార్‌పంప్‌లను అమర్చుకోవాల్సి ఉంటుంది. ఎంపిక చేసిన 7 గ్రామాలలో వరకోడు, బిళికెరె, గందనహళ్ళి, సాలిగ్రామ, తాండవపుర, మూగూరు, బెట్టదపుర ఉన్నాయి. ఈ ఏడు గ్రామాలలో గృహజ్యోతి పథకం లబ్ధిదారులు సోలార్‌లైట్‌లను అమర్చుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఆసక్తిలేనివారికి చైతన్యం కలిగించడం గ్రామపంచాయతీ అధికారులకు తలనొప్పిగా మారింది. సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకోకుంటే గృహజ్యోతి పథకం కింద లబ్ధిపొందడం కష్టమని గ్రామస్తులలో భయం నెలకొంది.

హాసనాంబ దర్శనానికి తెర

● నేడు ప్రత్యేక పూజలతో ఆలయానికి తాళం



మీడియాతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి కృష్ణబైరే గౌడ

బెంగళూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఏడాదికోసారి మాత్రమే తెరుచుకునే హాసనాంబదేవి సర్వదర్శనానికి తెరపడింది. 13రోజులపాటు జరిగిన సిద్దేశ్వర జాతరకు లక్షలాదిమంది భక్తులు తరలివచ్చారు. బుధవారం సాయంత్రం 7 గంటలకు సర్వదర్శనం ప్రక్రియను ముగించారు. వాస్తవానికి చివరిరోజు అమ్మవారి దర్శనం చేసుకోవాలని తెల్లవారుజామునుంచే భక్తులు పోటెత్తారు. ఆరేడు కిలోమీటర్లకుపైగా క్యూలో నిల్చుని దర్శనం కోసం పాట్లు పడ్డారు. గతంలో ఎన్నడూలేని విధంగా హాసనాంబ దర్శన విషయంలో ఈ ఏడాది ప్రత్యేక ప్రక్రియ చేపట్టారు. వీఐపీల సంస్కృతిని, వారికి సౌకర్యాలు తగ్గించారు. సాధారణ భక్తులకు ప్రాధాన్యం ఇచ్చారు. రూ.300, రూ.1000 టిక్కెట్లను విక్రయించారు. సాధారణ దర్శనం ఒకటి రెండురోజులు మినహాయిస్తే దాదాపు పదిరోజులు ఐదారుగంటలకుపైగానే పట్టింది. జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రి కృష్ణబైరేగౌడ 13 రోజులపాటు అక్కడే మకాం వేసి పర్యవేక్షించారు. హాసన్ జిల్లా అధికారి కేఎస్ లతాకుమారి, ఎస్పీ మహ్మద్ సుజిత హాసనాంబ జాతరకు ప్రాధాన్యత ఇచ్చారు. బుధవారం మధ్యాహ్నానికే 26 లక్షలమంది భక్తులు హాసనాంబదేవిని దర్శించుకున్నారు. చివరిరోజు ఎక్కువమంది భక్తులు ఉండడంతో వేగవంతంగా దర్శనం జరిపేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పటిదాకా 22 కోట్ల రూపాయలు వసూలైనట్టు అధికారులు ప్రకటించారు. ఈ ఏడాది హాసనాంబను దర్శించుకున్న ప్రముఖులలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, కేంద్రమంత్రులు కుమారస్వామి, శోభాకరంద్లాజె, రాష్ట్రమంత్రులు ఉన్నారు. సినిమా నటులు, రాష్ట్రస్థాయి క్రీడాకారులు హాసనాంబదేవిని దర్శించుకున్నారు. దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి హాసనాంబదేవి దర్శన ఏర్పాట్లను రెండుమూడుసార్లు ప్రత్యేకంగా పర్యవేక్షించారు. కాగా గురువారం భక్తులకు దర్శన అవకాశం ఉండదు. కానీ ఉదయం నుంచి 11 గంటలదాకా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకపూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతాయి. 12 గంటలకు గర్భగుడి తలుపులు మూసివేస్తారు. దీంతో హాసనాంబదేవి దర్శనంతోపాటు ఈ ఏడాది సిద్దేశ్వర జాతర ముగిసినట్టు అవుతుంది.



కారు యజమాని నుంచి పార్కింగ్ రుసుం వసూలు చేస్తున్న దృశ్యం

పార్కింగ్ పేరుతో పైసా వసూల్

● పర్యాటకుల నుంచి ఇష్టారాజ్యంగా వసూళ్లు

బళ్లారి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రం హంపీలో పార్కింగ్ పేరుతో కొందరు ప్రైవేటు వ్యక్తులు ఇష్టారాజ్యంగా డబ్బు వసూలు చేస్తున్నారు. ఇక్కడున్న ప్రతి స్మారకం వద్ద పార్కింగ్ పేరుతో డబ్బులు గుంజుతున్నారు. ద్విచక్రవాహనాలు, కార్లు, బస్సులు ఇలా అన్నిటికీ ఒక రేటు పెట్టి వసూలు చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఇక్కడ రోడ్లు సరిగా లేకున్నా, స్మారకం వద్దకు వెళ్లడానికి దారులు లేకున్నా పార్కింగ్ ఫీజులు ఎందుకు కట్టాలని పర్యాటకులు వారిని నిలదీస్తున్నారు. కానీ ఇవేమీ పట్టకుండా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఏనుగుశాల, ఉగ్రనరసింహ మండపం, చక్రతీర్థ, సప్తస్వరాలు, ఇలా అన్ని చోట్లా పార్కింగ్ పేరుతో టూరిస్టు వాహనదారుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. పర్యాటక కేంద్ర అధికారులు, దేవదాయ, టూరిజం శాఖ పట్టించుకోకపోవడంతోనే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పర్యాటకులు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పర్యాటకులు కోరుతున్నారు.

గాలివాన బీభత్సం

● చేతికందిన పంట నేలపాలు ● ఆందోళనలో అన్నదాత



బళ్లారి రూరల్‌లో నేలవాలిన వరి పంట

బళ్లారి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మరో పాతిక రోజులకు పంట కోతకు వచ్చేస్తుంది. ఎకరాకు వరి 50 బస్తాలు, మిరప, జొన్న కూడా మంచి దిగుబడే వస్తుంది. మంగళవారం వరకు రైతులు ఎంతో ఆశగా ఉన్నారు. అయితే బుధవారం బలమైన ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఫలితం పంట అంతా నేలపాలైంది. చేతికందుతుందన్న దశలో నీటిలో మునిగిపోయింది. రైతు పడిన కష్టం, కన్న కలలు ఒక్క రాత్రిలో చెరిగిపోయింది.

తుంగభద్ర డ్యాం కింద బళ్లారి, కొప్పళ, రాయచూరు, విజయనగర జిల్లాల పరిధిలో రైతులు వరి, మొక్కజొన్న, మిరప పంటను సాగు చేశారు. వరి పంట సాగు చేసి కొన్ని చోట్ల 65 రోజులు కాగా మరి కొందరు రైతులు ముందుగానే పంటను వేశారు. ముందు సాగు చేసిన వరి పైరు గాలులకు నెలకొరిగి గింజలు రాలిపోయాయి. ఇక వెనుక వేసిన వరి పైరు నేలకొరిగింది. దీంతో పైరు నీటిలో నాని కుళ్లిపోతోంది. ఏమాత్రం పంట దిగుబడి అందే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాలో సగటున 50 బస్తాలు వరి దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. ఇందుకు పెట్టబడి రూ.50 వేల వరకూ పెట్టామని తెలిపారు. ప్రస్తుతం ఎకరాకు కొన్ని చోట్ల 25 బస్తాలు అందుతాయని, మరి కొంత మంది రైతులకు అవికూడా చేతికి అందకుండా ఉన్నాయని ఆవేదన చెందుతున్నారు. మిరప పంటకు కూడా తేమ శాతం ఎక్కువై పంట చేతికి అందే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల మిరపకు తేమ శాతం ఎక్కువ కావడంతో చెట్టు వాలిపోతోంది. మరి కొన్ని చోట్ల మిరప పంట మునిగిపోయిందని రైతులు వాపోతున్నారు. ఎకరా మిరప సాగుకు సరాసరి రూ.1.5 లక్షలు పెట్టబడి పెట్టినట్లు వారు తెలిపారు. ఇక మొక్కజొన్న పంట కూడా ఏమాత్రం చేతికి అందకూండా పోతుందని రైతులు దిగులు చెందుతున్నారు.

పంట నష్ట పరిహారం ఇవ్వాలి



బలమైన గాలివానకు తుంగభద్ర జలాశయం, ఇతర ప్రాం తాల్లో రైతులు సాగు చేసిన వరి, మిరప, మొక్కజొన్న పంటలు బాగా దెబ్బతిన్నాయి. వరి రైతు మరో 25 రోజులకు కోతకు వస్తుంది. అలాంటి సమయంలో పైరు నేలకు కూలిపోవడం వల్ల రైతులకు తీరని పంట నష్టం వాటిల్లింది. ప్రభుత్వం రైతులకు ఎకరాకు పెట్టబడితో పాటు పంట దిగుబడి నష్టం కలిపి రూ.లక్ష ఇవ్వాలి.

-మాధవరెడ్డి, రైతు సంఘం నాయకుడు

నందిని బ్రాండ్‌కు పెరిగిన ఆదరణ

● దీపావళి, దసరాకు రూ.46 కోట్ల టర్నోవర్
● మంత్రి వెంకటేశ్ వెల్లడి



బెంగళూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటక పాల సమాఖ్య (కేఎంఎఫ్) ఆధ్వర్యంలోని 'నందిని' బ్రాండ్ ఉత్పత్తులకు ప్రజాదరణ పెరిగింది. ప్రతి సంవత్సరం దసరా, దీపావళి వేళ పలురకాల మిఠాయిలకు డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం నందిని బ్రాండ్‌లో 40కుపైగా రకాలు అందుబాటులో ఉన్నాయి. కర్ణాటక పాల సమాఖ్య తన పాతరికార్డులను తానే అధిగమించింది. దసరా, దీపావళి పండుగల వేళ 1,100 టన్నుల స్వీట్స్‌ను విక్రయించి తద్వారా రూ.46కోట్ల లావాదేవీలు సాధ్యమయ్యాయని పశుసంవర్ధకశాఖ మంత్రి కే వెంకటేశ్ వెల్లడించారు. నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేఎంఎఫ్ సాధనలో ఇదో మైలురాయి అన్నారు. సాధారణంగా దసరా, దీపావళి సందర్భంగా స్వీట్లకు డిమాండ్ ఉంటుందన్నారు. నందిని బ్రాండ్ ముందస్తుగానే ఇందుకు సిద్ధం కావడంతో రికార్డును అధిగమించిందన్నారు. 2024 దసరా పండుగ సీజన్‌లో 724 టన్నుల స్వీట్లు విక్రయించగా రూ.33.48 కోట్ల లావాదేవీలు సాధ్యమైందన్నారు. ఈ సంవత్సరం వెయ్యి టన్నుల లక్ష్యం ఉంచుకోగా అంతకంటే ఎక్కువగా విక్రయాలు సాధ్యమయ్యాయన్నారు. గత ఏడాదితోపోలిస్తే 38శాతం అధికమన్నారు. నందిని బ్రాండ్ నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి అన్నారు. దూద్‌పేడా, మైసూరు పాక్, బాదామ్ బర్ఫి, కొబ్బరి బర్ఫి, రసగుల్లా వంటివి ప్రజాదరణ పొందాయన్నారు. గత ఐదు దశాబ్దాల నుంచి పాల సహకార రంగంలో కేఎంఎఫ్ ముందంజలో ఉందన్నారు. ప్రతిరోజూ కోటి లీటర్ల పాలు సేకరణ ఉండగా, ఇందులో పెరుగు సహా 65లక్షల లీటర్లు పాలు విక్రయాలు ఉన్నాయన్నారు. మిగిలిన పాలతో పలు రకాల ఉత్పత్తులు సిద్ధం చేస్తూ రాష్ట్రంలోనూ, ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నట్టు తెలిపారు. నందిని బ్రాండ్‌లో నెయ్యి, వెన్న, పన్నీర్, ఇతర స్వీట్లు, పాలపొడి, మిల్క్‌షేక్‌లతోపాటు సుమారు 175 రకాల ఉత్పత్తులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, గోవా, కేరళ, ఢిల్లీ, అస్సోం, తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతోందన్నారు. నందిని బ్రాండ్ వినియోగదారుల విశ్వాసానికి మారుపేరుగా ఉందన్నారు.



మీడియాతో మంత్రి వెంకటేశ్



అలంకరణలో బనశంకరి అమ్మవారు

ఆలయాల్లో విశేష పూజలు

బెంగళూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగలో భాగంగా బలి పాడ్యమిని పురస్కరించుకుని బుధవారం పలు ఆలయాలలో విశేషపూజలు, అలంకరణలు కొనసాగాయి. ఈ సందర్భంగా కొన్ని ఆలయాలలో బలిపాడ్యమి పురాణ ప్రాధాన్యతను వివరించారు. ప్రత్యేకించి పాతమైసూరు ప్రాంతంలో బలి పాడ్యమి సందర్భంగా గోమయంతో గొబ్బెమ్మ తరహాలో రూపొందించి పూజలు, దీపారాధన చేస్తారు. ఈ నేపథ్యంలోనే గోపూజ నిర్వహించడం సంప్రదాయంగా ఉంది. కాగా నగరంలోని బనశంకరి అమ్మవారికి విశేషపూజలు నిర్వహించి పుష్పాలతో అలంకరణ చేశారు. జేపీ నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఆయా ఆలయాలకు భక్తులు తరలివచ్చి స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల ముందు దీపాలు వెలిగించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.



జేపీ నగర్‌లోని వేంకటేశ్వరస్వామి

రాఘవేంద్రుడి సేవలో డిప్యూటీ సీఎం డీకే

మంత్రాలయం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామిని బుధవారం కర్ణాటక రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ దర్శించుకున్నారు. ఆయనతో పాటు తెలంగాణ క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిట శ్రీహరి, కర్ణాటక చిన్ననీటి పారుదల శాఖ మంత్రి బోసేరాజు, రాయచూరు ఎంపీ కుమార్ నాయక్, మంత్రాలయం, మాన్వీ, మస్కీ, రాయచూరు రూరల్, సింధనూరు ఎమ్మెల్యేలు వై.బాలనాగిరెడ్డి, హంపయ్యనాయక్, బసవన్నగౌడు, దద్దాల బసవన్నగౌడు, హంపన్నగౌడు, ఎమ్మెల్సీలు బసన్నగౌడు బడాలీ, వసంతకుమార్, బసవరాజుపాటిల్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు సురేష్ కోణాపూరు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తిలు వేదపండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మఠంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు వివరించారు. వీరికి రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం, వెండిగిన్నెలు ఇచ్చి ఆశీర్వదించారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ గోశాలను సందర్శించి సతీసమేతంగా గోపూజ నిర్వహించారు. వీరి వెంట రాజా ఎస్ అప్రమేయ ఆచార్, కృష్ణ కౌశిక్, కిరణ్ కుమార్, సంజీవ్ కులకర్ణి, రాయచూరు ఎస్పీ పుట్టమాదయ్య, కలెక్టర్ నితీష్, కర్నూలు ఏఎస్పీ హుస్సేన్ పీర, ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి, రాయచూరు సీఈఓ ఈశ్వర్‌కుమార్ పాండు, ఏసీ గజానంద్‌బోలె, రాయచూరు ఏఎస్పీలు హరీష్, కుమార్‌స్వామి, శాంతివీర, తహసీల్దారు రమాదేవి, సీఐలు రామాంజులు, మంజునాథ్, పద్మనాభ తీర్థ ఏసీ గెస్ట్‌హౌస్, పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రదక్షిణ చేస్తున్న డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు



పీఠాధిపతితో కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు

మూలరాములకు మహాభిషేకం



మూల రాములకు మహా అభిషేకం చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు

మంత్రాలయం,అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం శ్రీమఠంలో బుధవారం బలి పాడ్యమిని పురస్కరించుకుని మూలరాములకు పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు మహాభిషేకం నిర్వహించారు. ఏడాదికి రెండు సార్లు జరిగే (శ్రీరామనవమి, బలిపాడ్యమి)ని పూర్ణబోధ పూజామందిరంలో ఘనంగా నిర్వహించడం శ్రీమఠంలో సంప్రదాయంగా వస్తోంది. పూర్ణబోధ పూజా మందిరంలోని వెండి మండపంలో బంగారు మంటపం అధిష్ఠించి అందులో నవరత్నాలతో మూల రాములు, జయరాములు, దిగ్విజయరాములకు అభిషేకం చేశారు. క్షీరాభిషేకం, తులసి అర్చన, పుష్పాభిషేకం, స్వర్ణ నాణేలతో అభిషేకం, గంధలేపనం, వివిధ పదార్థాలతో మహాఅభిషేకం నిర్వహించారు. ఈ వేడుకను కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తెలంగాణ, కర్ణాటక మంత్రులు వాకిట శ్రీహరి,బోసరాజులతో పాటు వేలాది మంది భక్తులు తిలకించారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు రజిత గజవాహనం, బంగారు రథ సేవను నిర్వహించారు. కార్యక్రమంలో విద్వాన్ పండిత కేసరి రాజా ఎస్.గిరిరాజాచార్, సూపరింటెండెంట్లు అనంత పురాణిక్, విజయేంద్ర ఆచార్, వ్యాసరాజాచార్, జయతీర్థ ఆచార్ తదితరులు పాల్గొన్నారు.



మహాభిషేకం పూజల్లో పాల్గొన్న డీకే, వాకిట శ్రీహరి, బోసరాజు

ముసురు భయం

- జడివానకు తడిసిన మొక్కజొన్న
- అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షం
- ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం
- తడిసిపోతున్న మొక్కజొన్న ధాన్యం

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి జిల్లాను ముసురు కమ్ముకుంది. దాదాపు అన్ని మండలాల్లో మంగళవారం వర్షం కురిసింది. ఆకాశం బుధవారం ఉదయం నుంచి మేఘావృతమైంది. అనంతపురం, యాడికి, గార్లదిన్నె, నార్పల మండలాల్లో బుధవారం మోస్తారు వర్షం కురిసింది. పుట్లూరు, విడపనకల్లు, తాడిపత్రి, పామిడి తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. అత్యధికంగా ఆత్మకూరులో 3.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఉరవకొండ 3.5, బెళుగుప్ప 3, గుంతకల్లు 2.1, డి.హీరేహాళ్, విడపనకల్లు 2.0, నార్పల 1.7, బొమ్మనహాళ్, గుత్తి 1.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 1.1 సెంటీమీటర్లలోపు వర్షపాతం నమోదైంది.

భారీ వర్షాలకు అవకాశం

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి జిల్లాలోని ఒకటి రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం హెచ్చరించినట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణ స్వామి తెలిపారు. ఈ అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశలో పయనించి, వాయుగుండంగా మారుతుందని తెలిపారు. ఈ సమయంలో పలు చోట్ల ఈదరుగాలులతో కూడిన వర్షం, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. పలు చోట్ల గంటకు 25 కి.మీ. నుంచి 30 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తడిసిన మొక్కజొన్న

గార్లదిన్నె మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న పంట దెబ్బతింటోంది. గార్లదిన్నె, కల్లూరు, సిరివరం, బూదేడు, కృష్ణాపురం, యర్రగుంట్ల, సంజీవపురం, మర్తాడు, కొట్టాలపల్లి, అంకంపేట, గుడ్డాలపల్లి తదితర గ్రామాల్లో సుమారు 600 మంది దాదాపు 1600 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశారు. పంట కోతకు వచ్చింది. ఈ సమయంలో జడివానలు కురుస్తుండటంతో రైతులు కోత కోయాలంటే భయపడుతున్నారు. ఇప్పటికే కోత కోసి, కల్లాలు, జాతీయ రహదారి పక్కన ఆరబోసిన ధాన్యం తడిసిపోతోంది. కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు తీయాల్సి వస్తోంది. ధాన్యంపై టార్పాలిన్ పట్టలు కప్పడంతోగాలి, వెలుతురు సోకక గింజల రంగు నల్లగా మారుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబోస్తున్నరైతులు

50 టన్నుల ధాన్యం..

విడపనకల్లు మండలంలోని హావళిగి, గడేకల్లు, ఆర్ కొట్టాల, ఉండబండ, చీకలగురికి, పొలికి, అంచనహాలు గ్రామాల్లో మొక్కజొన్న ధాన్యం తడిసి ముద్దైంది. గడేకల్లులో 67వ జాతీయ రహదారికి ఇరువైపులా అర కిలోమీటరు వరకూ మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబెట్టారు. హావళిగి పాఠశాల మైదానంలో వంద మందికి పైగా రైతులు ధాన్యాన్ని ఆరబెట్టారు. విత్తనం తడవకుండా కింద, పైన టార్పాలిన్‌లు కప్పి ఉంచారు. కానీ భారీ వర్షాల కారణంగా నీరు లోపలికి వెళుతోంది. తడిసిన ధాన్యాన్ని రైతులు బకెట్లలో నింపి బయట మరోచోట ఆరబోస్తున్నారు. టార్పాలిన్‌పై నిలిచిన వర్షపు నీటిని బట్టలలో అద్ది బకెట్లలో పిండి ఎత్తిపోస్తున్నారు. మండలంలో 50 టన్నులకు పైగా మొక్కజొన్న ధాన్యం తడిసిపోయింది. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

వంద క్వింటాళ్ల ధాన్యం..



మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. విత్తనం ఆరబెట్టుకుని బళ్లారి మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించాలని భావించాను. వర్షానికి వంద క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయింది. మళ్లీ ఆరబెట్టుకునేందుకు నానా తిప్పలు పడుతున్నాము. నెల క్రితం క్వింటం ధర రూ.2500 వరకూ పలికింది. ఇప్పుడు రూ.1700 అన్నా కొనేవారు లేరు. తడిసిన పంటను ఏ వ్యాపారీ ముట్టుకోడు. వాళ్లు ఎంతకి అడిగితే అంతకు ఇవ్వాల్సిందే. నాకు రూ.1.5లక్ష నష్టం వచ్చింది. పెట్టుబడి కూడా రాదు.

- దశరథరెడ్డి, హావళిగి

ఈ కష్టం పగవాడికి కూడా వద్దు..



మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. కంకిని మిషన్‌కు ఆడించి విత్తనాన్ని ఆర బెట్టుకున్నాను. రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. కింద, పైన టార్పాలిన్ కప్పినా ఫలితం కనిపించడం లేదు. అరగంట ఆరబెడితే చాలు వర్షం మొదలౌతోంది. ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదు. ఈ కష్టం పగవారికి కూడా రాకూడదు. దాదాపుగా 90 క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయింది. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

-నరసింహా రెడ్డి, హావళిగి

అప్పులు తీరుతాయనుకుంటే..



గార్లదిన్నెలో 9 ఎకరాల భూమిని రూ.2 లక్షలకు కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగుచేశాను. ఎకరానికి రూ.40 వేల వరకూ పెట్టుబడి పెట్టాను. దిగుబడి బాగా వచ్చింది. అప్పులు తీరుతాయని సంతోషపడ్డాం. కానీ ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసిపోయింది. రంగు మారితే ధర పలకదు.

- రామాంజనేయులు, సిరివరం

ధర తగ్గించారు..



మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశాను. పంటకోసి ఆరబోశాం. వర్షానికి మొత్తం తడిసిపోతోంది. టార్పాలిన్ పట్టలు కప్పినా ఫలితం కనిపించడం లేదు. గింజలు తడిస్తే వ్యాపారులు కొనుగోలు చేయరు. మొన్నటి వరకు క్వింటం ధర రూ.2,200 ఉండేది. ఇప్పుడు రూ.1,800 ఇస్తామంటున్నారు.

- గోపాల్, సిరివరం

ఆదుకోవాలి..



ఏ పంట సాగు చేసినా నష్టం వస్తోంది. అందుకే మొక్కజొన్నతో మేలు జరుగుతుందని రైతులందరం ఆసక్తి చూపించాము. వర్షానికి పంట దెబ్బతినింది. రూ.లక్ష వెచ్చించి 3 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశాను. కోత సమయంలో వర్షాలు పడుతున్నాయి. మా అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

- గంగాధర్, సిరివరం

ధర్మవరంలో తనిఖీలు

- ఎస్పీ ఆధ్వర్యంలో సోదాలు
- 85 ద్విచక్రవాహనాలు, 4 ఆటోలు సీజ్

ధర్మవరం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 8 మంది సీఐలు, 10 మంది ఎస్‌ఐలు, 156 మంది సిబ్బంది ఒక్కసారిగా తనిఖీలకు దిగడంతో ధర్మవరం దద్దరిల్లింది. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ధర్మవరం, పెనుకొండ డీఎస్పీలు హేమంత్‌కుమార్, నరసింగప్ప, సీఐలు, ఎస్‌ఐలతో కలిసి ఎస్పీ సతీ‌ష్‌కుమార్ బుధవారం సోదాలు నిర్వహించారు. ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నేర చరిత్ర ఉన్నవారికి ఎస్పీ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. రౌడీషీటర్ల ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులతో మాట్లాడి మంచి ప్రవర్తనలో నడుచుకునే విధంగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. తుపాకులు కలిగి ఉన్నారన్న సమాచారంతో ప్రతి ఇంటినీ సోదా చేశారు. నంబరు ప్లేట్లు, రికార్డులు లేని వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... కార్డెన్ సెర్చ్‌లో భాగంగా ఎవరూ తప్పించుకోకుండా 16 బృందాలు ఏర్పాటుచేసి, రెండు డ్రోన్ కెమరాలు, బాడీవన్ కెమెరాలు, మొబైల్ స్కానింగ్ చెక్ డివైజ్‌లను వినియోగించామన్నారు. మొబైల్ స్కానింగ్ ఫింగర్ ప్రింట్ డివైజ్‌లు వినియోగించి, పాత నేరస్తుల డేటా సేకరించామన్నారు. ఆరుగురు రౌడీషీటర్లు, 8 మంది సస్పెక్ట్ షీట్లు కలిగిన వారిని గుర్తించి పరిశీలించామన్నారు. 25 ఏళ్ల క్రితం నేరాలు చేసిన వారు కూడా కాలనీలో ఉన్నారన్నారు. ప్రశాంతంగా బతకాలని వారికి సూచించామన్నారు. 15ఏళ్లుగా ప్రశాంత జీవనం సాగిస్తున్న వారిపై రౌడీషీట్లను తొలగిస్తామన్నారు. రాత్రి సమయాల్లో తాగి గొడవలు, అల్లర్లు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై రౌడీషీట్లు తెరుస్తామన్నారు. నంబర్ ప్లేట్లులేని 85 ద్విచక్రవాహనాలు, 4 ఆటోలను సీజ్ చేశామన్నారు. ఇందిరమ్మ కాలనీలో 4 సీసీ కెమెరాలు ప్రస్తుతానికి ఉన్నాయనీ, మరో 10 ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలిపారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ

నిర్లక్ష్యంపై చర్యలు తప్పవ్

పీఏసీఎస్ అధికారులపై ఎమ్మెల్యే పరిటాల సునీత అసంతృప్తి

అనంతపురం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విస్తృతస్థాయి సమావేశానికి పూర్తి సమాచారంతో కాకుండా నిర్లక్ష్యంగా వస్తే చర్యలు తప్పవని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి పరిధిలోని సొసైటీల సీఈఓలు, బ్యాంకుల అధికారులు, ఉద్యోగులపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోవాలని సూచించారు. బుధవారం మండలంలోని ఆర్ కన్వెన్షన్ హాల్‌లో రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని పీఏసీఎస్‌ల పాలకవర్గం, సంఘం సిబ్బంది, ఏడీసీసీ బ్యాంకు మేనేజర్లు, సూపర్‌వైజర్ల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్ హాజరయ్యారు. సొసైటీల సీఈఓలు తమ పరిధిలోని రైతులు, రుణాలు, ఇతరత్రా వాటి గురించి తెలియజేశారు. ఇందులో కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లికి సంబంధించిన అధికారులు సరైన వివరాలు వెల్లడించకపోవడం పట్ల ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు కూడా అధికారులు నిబంధనలు అంటూ అడ్డు చెబుతున్నారని పలువురు సొసైటీల చైర్మన్లు ప్రస్తావించారు. వైసీపీ హయాంలో అక్రమంగా ఇచ్చిన రుణాలపై విచారణ చేయాలన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముట్టిమండుగు కేశవరెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో అనువుగాని చోట గోదాములు కట్టారన్నారు. కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చడానికే వాటిని నిర్మించారన్నారు. అవన్నీ బ్యాంకులకు భారంగా మారాయన్నారు. కొండగుట్టల్లో కడితే వాటిని ఎలా వినియోగించుకోవాలో అర్థంకావట్లేదన్నారు. త్వరలోనే వన్‌టైం సెటిల్‌మెంట్ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖ, డీజీఎం రాంప్రసాద్, రాప్తాడు నియోజకవర్గంలోని సింగిల్ విండో అధ్యక్షులు లక్ష్మీనారాయణ, పాముదాయి రఘు, కృష్ణమోహన్ చౌదరి, నరసింహులు, నెట్టెం వెంకటేశ్వర్లు, ముత్యాలు, గోపాల్, లింగన్న, బ్రహ్మానందరెడ్డి, కన్వీనర్లు జింకా సూర్యనారాయణ, కొండప్ప, శ్రీనివాసులు, ముత్యాలురెడ్డి, సీనియర్ నాయకులు రామ్మూర్తినాయుడు, సుధాకర్‌నాయుడు, రంగయ్య, దండు ఓబులేసు, వేణుగోపాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

నెట్టికంటి ఆలయంలో హనుమద్దీక్షలు

గుంతకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీక పాడ్యమి తిథిని పురస్కరించుకుని కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తులు హనుమద్దీక్షలను చేపట్టారు. ప్రతి సంవత్సరం హనుమద్ మాలను ధరించే భక్తులు కసాపురం ఆలయానికి వచ్చి కార్తీక మాస ప్రారంభ తిథిన మండల దీక్షలు, ఇరవై రోజుల తర్వాత అర్ధ మండల దీక్షలను స్వీకరిస్తారు. ఈ మేరకు బుధవారం ఉదయం వేకువజామునే కాషాయ వస్త్రాలను ధరించి కసాపురం ఆలయానికి వచ్చిన భక్తులచే ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా హనుమద్ మాలలను తొడిగి, మంత్రోపదేశం చేసి హనుమద్దీక్షలను ప్రారంభించారు. దీక్షలను చేపట్టిన భక్తులు ప్రదక్షిణలు చేసి, స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. నవంబరు 11వ తేదీన అర్ధ మండల దీక్షా కార్యక్రమాన్ని ఆలయంలో నిర్వహించనున్నారు. కసాపురం దేవస్థానంతోపాటు, వివిధ ఆలయాల్లో మండల, అర్ధ మండల దీక్షలు చేపట్టిన మాలాధారులు డిసెంబరు 2వ తేదీన ఇరుముడులతో నెట్టికంటి సన్నిధికి తరలివస్తారు. డిసెంబరు 3న దేవస్థాన ప్రాంగణంలో చేపట్టే హనుమద్ వ్రతంలో పాల్గొని మాలలను విసర్జించి, దీక్షలను విరమిస్తారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్స్ కోసం ఎదురుచూపు..!

ఉద్యోగోన్నతులు వచ్చినా తప్పని నిరీక్షణ

మిగిలిన జిల్లాల్లో ముగిసిన ప్రక్రియ

సీనియార్టీ కోల్పోతామని ఉద్యోగుల ఆందోళన

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగోన్నతులు కల్పించినా.. ప్లేస్‌మెంట్స్ కోసం పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇప్పటికే ప్రక్రియ ముగించడంతో వారికంటే సీనియర్లుగా ఉన్న వారు తదుపరి ఉద్యోగోన్నతుల్లో జూనియర్స్ అయిపోవాల్సి వస్తోందని మదనపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలువురు గ్రేడ్-1 కార్యదర్శులతో పాటు వీడీఓ (విలేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) కేటగిరిలో ఇద్దరు, డీపీఓ కార్యాలయం ప్యానల్ నుంచి మరో సీనియర్ అసిస్టెంట్‌కు డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఈ నెల 11న పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ క్రిష్ణతేజ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉత్తర్వులు వెలువడి పది రోజులు పూర్తయినా ప్లేస్‌మెంట్స్‌కు సంబంధించి జిల్లా అధికారుల్లో ఉలుకు పలుకు లేదన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఆయా మండలాలకు సంబంధించి స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి కొందరు లేఖలు కూడా సమర్పించినట్లు సమాచారం. ఆ మేరకు అనంతపురం జిల్లాలోని నాలుగు మండలాలకు సంబంధించిన డిప్యూటీ ఎంపీడీఓలకు బుధవారం ప్లేస్‌మెంట్స్ కేటాయిస్తూ డీపీఓ ఉత్తర్వులు జారీ చేశారు. సత్యసాయి జిల్లాకు సంబంధించి అతీగతీ లేకుండా పోతోందని బాధిత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగోన్నతి పొంది.. ప్లేస్‌మెంట్స్ కోసం ఎదురు చూస్తున్న వారి వివరాలు ఇలా ఉన్నాయి.



ఉద్యోగి పేరు	ప్రస్తుత స్థానం	జిల్లా/మండలం కేటాయింపు..
అశోక్ కుమార్	ఆకుతోటపల్లి	రాప్తాడు
గోపాల్	పామిడి	బెళుగుప్ప
రమణ	బొమ్మనహాల్	తాడిపత్రి
చంద్రశేఖర్	సీకే పల్లి	బ్రహ్మసముద్రం
శ్రీనివాసరెడ్డి	కొత్తచెరువు	సత్యసాయి
ప్రవీణ్‌కుమార్	నారాయణపురం	సత్యసాయి
ముత్యాలరెడ్డి	గార్లదిన్నె	సత్యసాయి
ప్రేమ్‌కుమార్	రాప్తాడు	సత్యసాయి
అబ్దుల్ మునాఫ్	కాలసముద్రం	సత్యసాయి
సాధీక్ అలీ	బుక్కపట్నం	సత్యసాయి
సుధాకర్ కుమార్	అమరాపురం	సత్యసాయి
బాబురావు	రొళ్ల	సత్యసాయి
వెంకటేశ్వరప్రసాద్	గుత్తి	అన్నమయ్య
మనోహర్	డీపీఓ కార్యాలయం	సత్యసాయి
ఎమ్‌ఎల్‌ఎన్ ప్రసాద్	కణేకల్లు	సత్యసాయి

సిసలైన పండగ..!

- డీఏ, అలవెన్సుల విడుదలపై ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల హర్షాతిరేకాలు
- జేఏసీల ఆధ్వర్యంలో ఆనందోత్సాహాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీపావళి పండుగకు ఒకరోజు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఒక డీఏతోపాటు ఇతర అలవెన్సులను విడుదల చేయడంపై ఆయావర్గాలు హర్షం వ్యక్తంచేశాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల జేఏసీ నాయకులతో చర్చలు జరపడం, వారి సమక్షంలోనే డీఏ, పలు డిమాండ్లపై సానుకూలంగా స్పందించడంపై వారు సంతోషపడుతున్నారు. 60 రోజుల్లో హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపేందుకు కమిటీని ఏర్పాటు చేసి, ఇన్సూరెన్స్ విధానంపై పరిశీలనకు ఆదేశాలు జారీ చేయడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చైల్డ్‌కేర్ లీవ్ అవకాశాన్ని మహిళా ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వరకూ పొడిగించడంపై వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హెల్త్ కార్డుల విషయంలో ప్యాకేజీ రేట్లు పెంచడం, జిల్లా ఆస్పత్రుల్లో చికిత్స పరిమితిని రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచడం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు.. సీఎం చంద్రబాబునాయుడు చిత్తశుద్ధి చాటుకున్నారని ప్రశంసలు కురిపిస్తున్నారు.

మిగిలిన డీఆర్, క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను పెంచి ఆదుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన డీఏ, అలవెన్సుల విషయం ఆనందం కలిగించే విషయం. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన విధంగా పెన్షనర్లకు డీఏను ఇచ్చింది. గత వైసీపీ ప్రభుత్వం తగ్గించిన క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను పెంచి ఉంటే బాగుండేది. అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలను చర్చలకు పిలిచి, అభిప్రాయాలు సేకరించడం సంతృప్తినిచ్చే అంశం. భవిష్యత్తులో పెన్షనర్లకు సంబంధించి డీఆర్‌లు, క్వాంటం ఆఫ్ పెన్షన్ పెంపుపై ప్రకటన చేస్తారనే నమ్మకం ఉంది.

-పెద్దన గౌడ్, ఏపీ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

జేఏసీ నేతలకు గౌరవమివ్వడం గర్వంగా ఉంది



సీఎం చంద్రబాబునాయుడు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై జేఏసీ నేతలను స్వాగతించి, గౌరవించడం పట్ల గర్వంగా ఉంది. వైసీపీ ప్రభుత్వంలో ఒక్కసారి కూడా ఉద్యోగ సంఘాలను సమస్యలపై చర్చించేందుకు పిలిచిన దాఖలాల్లేవు. డీఏ విడుదల చేయడంతోపాటు 2004కి ముందు రిక్రూట్ అయిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం ఆయావర్గాల్లో నమ్మకం కలిగించింది.

-మనోహర్ రెడ్డి, ఏపీఎన్జీల సంఘం నగర అధ్యక్షుడు

చర్చలు జరపడం ఆనందంగా ఉంది..



ఉద్యోగ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేరుగా చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించడం ఆనందంగా ఉంది. డీఏను విడుదల చేయడంతోపాటు పోలీసు అధికారులకు సంబంధించి సరెండర్ లీవ్‌లు చెల్లించడానికి అంగీకారం తెలపడం శుభపరిణామం. ఉద్యోగ సంఘాల నేతల అభిప్రాయాలను సేకరించడం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ గౌరవంగా ఫీలవుతున్నారు. మిగిలిన డీఏలను విడుదల చేసి, ఉద్యోగులకు బాసటగా నిలవాలి.

-తోట చెన్నప్ప, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మహిళా ఉద్యోగులకు చంద్రబాబు అండ..




మహిళా ఉద్యోగులకు సీఎం చంద్రబాబునాయుడు అండగా నిలబడ్డాడు. చైల్డ్‌కేర్ లీవ్‌లు (180 రోజులు) రిటైరయ్యే వరకూ పొందే అవకాశం కల్పించడం మహిళా ఉద్యోగుల్లో స్థైర్యం నింపింది. హెల్త్ కార్డుల విషయంలో ప్యాకేజీ రేట్లు పెంచడం భరోసా ఇచ్చింది.

-ఉమాదేవి, మహిళా విభాగ నగరాధ్యక్షురాలు, ఏపీఎన్జీఓల సంఘం

కరువు నేలలో కృష్ణమ్మ పరవళ్లు

మడకశిర, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): కరువు నేలలో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. నీటి వనరులే లేని మడకశిర ప్రాంతంలో కృష్ణాజలాలు ఉరకలు వేస్తున్నాయి. హంద్రీనీవా కాలువ ద్వారా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేస్తున్నారు. ఆ నీరు మండలంలోని మణూరు చెరువుకు చేరడంతో పూర్తిగా నిండిపోయింది. బుధవారం మరువ పోయింది. హరేసముద్రం చెరువుకు కృష్ణాజలాలు చేరుతున్నాయి. మడకశిర ప్రాంతంలోని మరిన్ని చెరువులను నింపనున్నట్లు హంద్రీనీవా అధికారులు చెబుతున్నారు. మూడేళ్లుగా సరైన వర్షాలు కురవక చేరువులో నీరులేక భూగర్భజలాలు అడుగంటిపోయి తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందనీ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆవేదన చెందారు. ప్రస్తుతం కృష్ణా జలాలతో చెరువు నిడడంతో తాగు, సాగు నీటి సమస్య పరిష్కారం కావడమేకాక బోర్ల కింద భూములు కూడా సాగులోకి వస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతేడాది నియోజకవర్గంలో పర్యటించినపుడు ఈ ప్రాంతంలోని చెరువులను కృష్ణాజలాలతో నింపి.. తాగు, సాగునీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేరుస్తూ నీటితో చెరువులను నింపుతుండడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



కృష్ణాజలాలతో మరువ పారుతున్న మణూరు చెరువు

నత్తల దండు..!

పంటలో కుప్పలుగా నత్తలు



లక్షలాదిగా పంటలపై దాడి

మొక్కదశలోనే నాశనం చేస్తున్నవైనం

తీవ్రంగా నష్టపోతున్నరైతులు

అమడగూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నత్త అంటే ఎక్కడో ఒకటో, రెండో కనిపిస్తుంటాయి. అలాంటి నత్తలు లక్షలాదిగా దండుగా ఏర్పడి, పంటలను నాశనం చేస్తున్నాయి. రైతులు లక్షలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలను మొక్కదశలోనే దెబ్బతీస్తున్నాయి. మండలంలోని మహమ్మదాబాద్ పంచాయతీ పరిధి గొల్లపల్లి ప్రాంతంలో లక్షలాది నత్తలు పంటల్లో సంచరిస్తున్నాయి. గ్రామ పరిధిలో 200 ఎకరాలదాకా సజ్జ, మొక్కజొన్న, టమోటా, మిరప, వంకాయ తదితర పంటలు సాగుచేశారు. అన్ని పంటలపైనా నత్తలు ప్రభావం చూపుతున్నాయి. మొక్క దశలో పూర్తిగా తినేస్తున్నాయి. వీటి బారి నుంచి పంటలను ఎలా కాపాడుకోవాలో అర్థంకాక రైతులు దిక్కులు చూస్తున్నారు. ఏడాదిన్నరగా వాటితో నష్టపోతూనే ఉన్నారు. పగలు పంటల్లో ఉంటూ, రాత్రిళ్లు ఇళ్లల్లోకి చొరబడి నిద్రలేకుండా చేస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నత్తల బెడద తప్పించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



మహిళా రైతుతో మాట్లాడుతున్న ఏఓ

నత్తలతో నష్టపోతున్నాం



ఎనిమిది ఎకరాల్లో టమోటా, మొక్కజొన్న సాగుచేశా. భారీ సంఖ్యలో నత్తలు చేరి పంటలను నాశనం చేస్తున్నాయి. పంటలు సాగు చేయాలంటే ఇబ్బందిగా మారింది. వ్యవసాయంతోనే జీవనం సాగిస్తున్నాం.పంటలు సాగు చేయకపోతే ఎలా బతకాలి? -గోపాల్‌రెడ్డి, గొల్లపల్లి

ఇళ్లలోకి చేరి ఇబ్బంది పెడుతున్నాయి



పగలు పంటలో, రాత్రి ఇళ్లలోకి చేరి నిద్ర లేకుండా చేస్తున్నాయి. రోగాల బారిన పడతామేమోనని ఆందోళన చెందుతున్నా. సాగుచేసిన పంటలను మొక్క దశలోనే తినేశాయి. తీవ్రంగా నష్టపోయా. - అమర్‌నాథ్‌రెడ్డి

రెండు పద్ధతుల్లో నివారణ

నత్తలు పొలాల్లోకి చొరబడి పంటలను నాశనం చేస్తున్నది వాస్తవమే. వీటి నివారణకు రెండు పద్ధతులున్నాయి. లీటరు నీటికి 100 గ్రాముల ఉప్పు కలిపి పంటపై కాకుండా నత్తలపై పిచికారీ చేయాలి. రెండో విధానంలో ఎకరాకు 250 గ్రాముల కాపర్ సల్ఫేట్, 250 గ్రాముల ఫెరస్ సల్ఫేట్ డ్రిప్పు ద్వారా కానీ, పిచికారీ చేసినా నత్తల బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చు.

- వెంకటరమణాచారి, ఏఓ, అమడగూరు

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఇగ్నేషియస్ ఆఫ్ లయోలా (జయంతి)



స్పానిష్ బాస్క్ క్యాథలిక్ మతగురువు 'సెయింట్ ఇగ్నేషియస్ ఆఫ్ లయోలా 1491 అక్టోబరు 23న స్పెయిన్ దేశంలో జన్మించారు. సొసైటీ ఆఫ్ జీసస్ సహ సంస్థాపకులు. 1541లో ప్యారిస్‌లో ఆయన తొలి సుపీరియర్ జనరల్. ఆధ్యాత్మిక భావాలు, ధ్యానం, ప్రార్థన, మానసిక భావాలను సులభంగా ప్రజలకు చేరువ చేశారు. 1556 జూలై 31న రోమ్‌లో కన్నుమూశారు.

బైరాన్‌సింగ్ షెకావత్ (జయంతి)



'పద్మభూషణ్' పురస్కార గ్రహీత, దేశ 11వ ఉపరాష్ట్రపతిగా 2002 నుంచి 2007వరకు వ్యవహరించిన బైరాన్‌సింగ్ షెకావత్ 1925 అక్టోబరు 23న రాజస్థాన్ రాష్ట్రం సికారా జిల్లాలో రాజ్‌పుత్ కుటుంబంలో జన్మించారు. బీజేపీలో పలు హోదాలలో కొనసాగారు. రాజస్థాన్ రాష్ట్రానికి 3 సార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన రికార్డు ఉంది. ఐదు దశాబ్దాలపాటు వివిధ నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహించారు. 'రాజస్థాన్ కా ఏక్ హి సింగ్' లేదా 'బబోసా'గా పిలువబడ్డారు. నిరుపేదలకు అండగా 'అంత్యోదయ' పథకాన్ని చేపట్టిన ఘనత ఆయనదే. రాజస్థాన్‌లో విద్య, పరిశ్రమలతో పాటు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేశారు. 2010 మే 15న కన్నుమూశారు.

పుతిన నరసింహాచార్ (వర్ధంతి)




కన్నడ కవి, రచయిత, 'పద్మశ్రీ' గ్రహీత పురోహిత తిరునారాయణ నరసింహాచార్ (పుతిన) 1905 మార్చి 17న మండ్య జిల్లా మేలుకోటెలో జన్మించారు. కువెంపు, ద రా బెంద్రే, పుతినలు కన్నడ సాహితీత్రయంగా పేరొందారు. సంగీతంతో కూడిన నాటకాలు రాశారు. కన్నడ భాషను ద్విగుణీకృతం చేసిన గణ్యులు. సాహిత్య అకాడమీ, పంప, నాడోజ, రాజ్యోత్సవ పురస్కారం తదితర గౌరవాలు అందుకున్నారు. 1998 అక్టోబరు 23న కన్నుమూశారు.

సునీల్ మిట్టల్ (పుట్టినరోజు)



దేశంలో అపర కుబేరుడిగా పేరొందిన 'పద్మభూషణ్' గ్రహీత సునీల్ భారతి మిట్టల్ 1957 అక్టోబరు 23న పంజాబ్ రాష్ట్రం లూధియానాలో జన్మించారు. దేశ బిలియనీర్, మానవతావాది, ఇంటర్నేషనల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. భారతి ఎంటర్‌ప్రైజెస్ సంస్థాపకులు, ఛైర్‌పర్సన్. 18వ ఏట వ్యాపారం మొదలుపెట్టాడు. టెలికామ్, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్, ఎడ్యుకేషన్, మాల్స్ హాస్పిటాలిటీ, అగ్రి, ఆహార రంగాలలో రాణించా రు. భారతి ఎయిర్‌టెల్ ప్రస్తుతం ప్రపంచంలో 2వ, దేశంలో మొదటిస్థానంలో నిలిచింది. 18 దేశాలలో ఆయన వ్యాపారాలు కొనసాగుతున్నాయి. భారతి ఫౌండేషన్, సత్యభారతి స్కూల్ ప్రోగ్రామ్ ద్వారా పల్లెల్లో సుమారు 45వేలమందికి ఉచిత విద్య అందిస్తున్నారు. లెక్కకు మిక్కిలి గౌరవాలు అందుకున్నారు.

ప్రభాస్ (పుట్టినరోజు)



అభిమానులచే 'డార్లింగ్'గా పిలవబడుతూ పాన్ ఇండియా స్టార్‌గా గుర్తింపు పొందిన టాలీవుడ్ హీరో ప్రభాస్ 1979 అక్టోబరు 23న మద్రాస్‌లో జన్మించారు. తెలుగు సినీరంగంలో అత్యధిక రెమ్యూనరేషన్ అందుకుంటున్న నటులలో ఒకరు. పూర్తి పేరు ఉప్పలపాటి వెంకట సూర్యనారాయణ ప్రభాస్ రాజు. రెబెల్‌స్టార్ నటుడు కృష్ణంరాజు సోదరుడైన సినీ నిర్మాత ఉప్పలపాటి సూర్యనారాయణ రాజు కుమారుడు, 'బాహుబలి' సినిమాతో అంతర్జాతీయంగా పేరొందారు. నంది, సినీమా, సైమా అవార్డులు తదితర పురస్కారాలు అందుకున్నారు. మేడమ్ టస్సాడ్ మ్యూజియంలో చోటు దక్కించుకున్న దక్షిణాది తొలి నటుడు.

ఫిర్యాదులు రాకుండా చూడండి

ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్ కుమార్

హిందూపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని, ఎక్కడా ఫిర్యాదులు రాకుండా చూడాలని విద్యుత్ శాఖ ఉద్యోగులకు ఆ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ సూచించారు. పట్టణంలోని విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయంలో పెనుకొండ, మడకశిర, హిందూపురం, డీఈఈలు, డీఈ, ఏడీ, ఏఈలతో బుధవారం సమీక్ష నిర్వహించారు. లో ఓల్టేజి సమస్య రాకుండా అవసరమైన చోట్ల డీసీఆర్ఎస్ ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసు కనెక్షన్‌లో జాప్యం జరగకూడదని, నిబంధనల మేరకు తక్షణమే వారికి పరికరాలు ఇవ్వాలని ఆదేశించారు. గృహ విద్యుత్ వినియోగదారులకు నచ్చజెప్పి, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పీఎం సూర్యఘర్‌పై వినియోగదారులకు అవగాహన పెంచాలని అన్నారు. వినియోగదారులపట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. వీధి దీపాలకు స్విచ్ కంట్రోల్ ఏర్పాటు చేయాలని, వీధి దీపాల లైన్ లేనిచోట కొత్త లైను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ బకాయిలు వందశాతం వసూలు చేయాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది పనిచేసేచోటే నివాసం ఉండాలని అన్నారు. సమావేశంలో ఏఈ శ్రీధర్‌రెడ్డి, మూడు నియోజకవర్గాల విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్ఈ సంపత్‌కుమార్

టిడ్కో గృహాలపై కదలిక..!

- నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం కసరత్తు
- రూ.382 కోట్ల నిధులకు ప్రతిపాదనలు
- ఉమ్మడి జిల్లాకు 38 వేల ఇళ్లు మంజూరు
- తుది దశకు చేరిన 16,272 ఇళ్ల నిర్మాణాలు
- ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం



అనంతపురంలోని టిడ్కో గృహాలు



ఇటీవల టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి, ఏఎంసీ కమిషనర్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాల లబ్ధిదారులకు త్వరలో రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పనున్నట్లు సమాచారం. సుమారు ఏడేళ్లుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు గృహాలను స్వాధీనం చేయడానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లోని పేదలకు ఏపీ టిడ్కో (ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) గృహాలను నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు 38,740 ఇళ్లను మంజూరు చేసింది. 16,272 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు టిడ్కోగృహాలను పూర్తిగా విస్మరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలను పూర్తి చేస్తామని ప్రకటించింది. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి రూ.382కోట్లు నిధులు అవసరమవుతాయని టిడ్కో ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. ఇళ్లు కేటాయించకనే ఈఎంఐలు కట్టాలని బ్యాంకుల నుంచి నోటీసులు పంపడంపై పలువురు లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టిడ్కో, అనంత నగరపాలక సంస్థ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో టిడ్కో ఇళ్లపై ఆశలు చిగురించాయి.

38వేల టిడ్కో గృహాలు మంజూరు

2014-19లో ఉన్న అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ఉండే పేదలకు అపార్ట్‌మెంట్ల తరహాలో టిడ్కోగృహాలు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాకు 38,740 టిడ్కో గృహాలను మంజూరు చేశారు. ఇందులో తాడిపత్రిలో ఫేజ్-1 కింద 3009 ఇళ్లు మంజూరు కాగా 2304, ఫేజ్-2 కింద 3,520 ఇళ్లకు గాను 2,880 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ధర్మవరంలో 8,832 ఇళ్లకు గాను 1440 ఇళ్లు మాత్రమే నిర్మాణం చేపట్టారు. గుత్తికి 398 మంజూరు చేయగా 96 నిర్మాణదశలో నిలిచిపోయాయి. హిందూపురంలో 2,750 ఇళ్లకు గాను 1200 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. కదిరిలో 3,762 ఇళ్లకు గాను 1104 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. పామిడిలో 2,599 ఇళ్లకు గాను 1344 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. పుట్టపర్తిలో 1243 ఇళ్లు మంజూరు కాగా 432 ఇళ్లు ప్రారంభించారు. అనంతపురంలో 6,117 ఇళ్లు మంజూరు చేయగా... 2304 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. గుంతకల్లులో 4,719 ఇళ్లు మంజూరు చేయగా 2,160 ఇళ్ల నిర్మాణ దశలో నిలిచిపోయాయి. రాయదుర్గానికి 1791 ఇళ్లు కేటాయించగా 1008 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని 11 పట్టణ ప్రాంతాల్లో 38,740 ఇళ్లు మంజూరు చేయగా.. 16,272 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. వీటిలో సుమారు 12వేలకు పైగా గృహాలను పూర్తి చేసి త్వరలో లబ్ధిదారులకు అందజేయడానికి సిద్ధం చేస్తున్నారు.



టిడ్కో ఇళ్ల మధ్యలో ఏపుగా పెరిగిన కంపచెట్లు

గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో టిడ్కో ఇళ్లను పూర్తిగా విస్మరించింది. అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలను పూర్తి చేయాల్సిన వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. దీంతో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలు, విషపురుగులకు ఆవాసాలుగా మారాయి. చివరి దశలో ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి వైసీపీ ప్రభుత్వంలో పలుమార్లు టిడ్కో అధికారులు ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేశారు. పైగా టీడీపీ ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహాలకు పలు ప్రాంతాలలో వైసీపీ రంగులు వేయడం పట్ల లబ్ధిదారుల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి.

రూ.382.92 కోట్ల నిధులకు ప్రతిపాదనలు

ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాల నిర్మాణాలు పూర్తి చేయడానికి రూ.382.92కోట్లు నిధులు అవసరమవుతాయని ఆశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అనంతపురం జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణానికి రూ.198 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.55.27 కోట్లు, మురుగు నీటిశుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు రూ.5.79 కోట్లు, తాడిపత్రిలో మహిళా మార్టుకు రూ.1.63 కోట్లు మొత్తంగా రూ.260.78కోట్లు నిధులు అవసరం ఉందని టిడ్కో ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. సత్యసాయి జిల్లాలో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి రూ.86.68 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.32కోట్లు, మురుగునీటి శుద్ధి వాటర్ ప్లాంట్‌కు రూ.3.46 కోట్లు మొత్తంగా రూ.122.14 కోట్లు నిధుల అవసరమవుతాయని ప్రతిపాదనలు అందజేశారు.

కంపచెట్లతో నిండిన సముదాయాలు

గత ప్రభుత్వం గాలికి వదిలేయడంతో టిడ్కో గృహ సముదాయాల్లో కంపచెట్లు పెరిగిపోయి అడవులను తలపిస్తున్నాయి. మరోవైపు వర్షం నీటితో నిండిపోయాయి. అనంత అర్బన్‌కు సంబంధించి ఏపీ టిడ్కో గృహ సముదాయం చిన్మయనగర్‌లో నిర్మిస్తున్నారు. అనంత నగరపాలక సంస్థ పరిధిలో 5వేల ఇళ్లకు 2304 ఇళ్లు నిర్మాణ దశకు చేరాయి. ఇళ్ల నిర్మాణం అలా ఉంచితే.. ఏపుగా పెరిగిన కంప చెట్లు ఓ వైపు, మరోవైపు వర్షపు నీరు చేరి కుంటను తలపిస్తోంది. కంపచెట్లను తొలగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఆందోళన వద్దు..



ఏపీ టిడ్కో లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. లబ్ధిదారుల ఆశలు, ఆలోచనలకు అనుగుణంగానే ప్రభుత్వం టిడ్కో గృహాలను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇటీవల ప్రభుత్వం లబ్ధిదారుల జాబితాను అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు మున్సిపల్ ఇంజనీర్లు, టిడ్కో అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో నిర్మాణ సముదాయాలను పరిశీలించి తుది నివేదికను ప్రభుత్వానికి పంపారు. నివేదిక ఆధారంగా రెండు మూడు నెలల్లో లబ్ధిదారులకు టిడ్కో గృహాలను అందజేయనుంది.

-రాజశేఖర్, ఎస్ఈ, అనంతపురం నగరపాలక సంస్థ

త్వరలోనే శుభవార్త వింటారు..



ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న టిడ్కో గృహ లబ్ధిదారులు త్వరలో శుభవార్త వింటారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. టిడ్కో, మున్సిపల్ ఇంజనీర్ల ప్రతిపాదనల మేరకు నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉంది. ఇప్పటికే టిడ్కో గృహాల లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపులు, ఆలస్యంపై అవగాహన కల్పిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి.. వాటి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. లబ్ధిదారులకు పూర్తి నిర్మాణం, కనీస వసతులు మురుగుకాలవలు, రోడ్లు, మంచినీటి వసతి కల్పించి అందజేస్తాం.

-సుధారాణి, టిడ్కో ఈఈ, ఉమ్మడి అనంతపురం జిల్లా

ప్రత్యేక రైళ్లలో లక్ష మందిని గమ్యానికి చేర్చాం

డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పండుగలకు ప్రత్యేక రైళ్లను నడపడం ద్వారా అదనంగా లక్షమంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చామని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. దసరా, దీపావళి రద్దీని దృష్టిలో ఉంచుకుని, టైం ఆఫ్ డిమాండ్ యోచనతో 66 ప్రత్యేక రైళ్ల ద్వారా 309 ట్రిప్పులను నడిపామని తెలిపారు. గుంతకల్లు రైల్వే డివిజన్ మీదుగా ప్రధాన నగరాలకు ప్రత్యేక రైళ్లలో లక్ష మందిని తరలించామని వివరించారు. 12 రైళ్లకు 19 స్టేషన్లలో తాత్కాలిక స్టాపింగ్‌లను కల్పించామని, ప్రయాణికుల సౌకర్యార్థం హెల్ప్ డెస్కులను కూడా నిర్వహించామని తెలిపారు. పెద్ద రైల్వే స్టేషన్లలో అన్ రిజర్వుడు టిక్కెట్ కౌంటర్లను, టికెట్ వెండింగ్ యంత్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది ప్రయాణికులకు భద్రతను కల్పించారని తెలిపారు. సమావేశంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీసీఎం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు బుల్లెట్ రైళ్లు..!

- 350 కి.మీ. వేగాన్ని తట్టుకునేలా రైలు మార్గం
- తెలుగు రాష్ట్రాల మీదుగా రెండు హైస్పీడ్ ట్రాక్‌లు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందడుగు
- నమూనాల విడుదల



గుంతకల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా మీదుగా అత్యున్నతమైన హైస్పీడ్ రైల్వే లైన్‌ను నిర్మించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. ఈ రైలు మార్గం సాకారమైతే అనంతపురం, సత్యసాయి జిల్లాలకు బుల్లెట్ రైళ్ల యోగం పట్టనుంది. రెండు తెలుగు రాష్ట్రాల మీదుగా రెండు హైస్పీడ్ రైలు మార్గాలను నిర్మించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందడుగు వేశాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి బుధవారం రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమిక్ సర్వీస్ (రైట్స్) సంస్థ నమూనాలను వెల్లడించింది. ఇందులోని సమాచారం ప్రకారం.. తెలుగు రాష్ట్రాల మీదుగా 350 కి.మీ.ల వేగంతో వెళ్లగలిగే అత్యుత్తమ శ్రేణిలో రెండు హైస్పీడ్ రైలు మార్గాలను నిర్మించనున్నారు. హైదరాబాద్-బెంగళూరు (605 కి.మీ.), హైదరాబాద్-చెన్నై (760 కి.మీ.) రైల్ రోడ్లకు రూపకల్పన చేశారు. హైదరాబాద్-బెంగళూరు రైలు మార్గం తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల మీదుగా, హైదరాబాద్-చెన్నై రైలు మార్గం తెలంగాణ, ఏపీ, తమిళనాడు రాష్ట్రాల గుండా నిర్మిస్తారు. ఈ రైలు మార్గాలతో బుల్లెట్ రైలు వెళ్లగలిగే స్థాయిలో ఎల్సీలు లేని, వంద శాతం రక్షిత (ప్రొటెక్టెడ్) అత్యద్భుతమైన లైన్ ఆవిష్కారం కానుంది. ప్రస్తుతమున్న రైల్ ట్రాక్‌పై 130 కి.మీ. వేగంతో రైళ్లను నడపలేమన్న వాస్తవాన్ని అవగతం చేసుకున్న రైల్వే శాఖ ప్రత్యేక హైస్పీడ్ రైలు మార్గాలను నిర్మించే ఆలోచనకు శ్రీకారం చుట్టింది.

అంచనా వ్యయాలు

అనంత ఉమ్మడి జిల్లా మీదుగా వెళ్లే హైదరాబాద్-బెంగళూరు లైన్ నిడివి 605 కి.మీ. కాగా ఇందుకు రూ.2.38 లక్షల కోట్లు వ్యయమవుతుందని అంచనావేశారు. హైదరాబాద్-చెన్నై లైన్ నిడివి 760 కి.మీ.లు కాగా, దీని నిర్మాణానికి రూ.3.04 లక్షల కోట్ల నిధుల అంచనా కట్టారు. ఈ లైన్ రాష్ట్రంలో కర్నూలు జిల్లాలో 46.56 కి.మీ.లు, నంద్యాల జిల్లాలో 37.3 కి.మీ.లు, అనంతపురం జిల్లాలో 86.6 కి.మీ.లు, శ్రీ సత్యసాయి జిల్లాలో 79.08 కి.మీ. మేర నిర్మితం కానుంది. ఇందుకు గానూ 988.82 హెక్టార్ల భూమి అవసరమతుందని అంచనా వేశారు. హైదరాబాద్-చెన్నై లైన్ 760కి.మీ. నిర్మించనుండగా.. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 504 కి.మీ.ల లైన్ ఏర్పడనుంది. ఇందుకు మొత్తం మీద 1,873.7 హెక్టార్ల భూమి అవసరం కానుంది.

రైలు మార్గం ఇలా..

హైదరాబాద్-బెంగళూరు హైస్పీడ్ రైలుమార్గాన్ని నిర్మించడానికి స్కెచ్‌ను రూపొందించారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు, భరత్‌సిటీ, మహబూబ్‌నగర్, వనపర్తిరోడ్, కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, దుద్దేబండ, హిందూపురం, కర్ణాటకలోని అలిపుర, దేవనహళ్లి, కొడిహళ్లి మీదుగా లైన్‌ను నిర్మిస్తారు. హైదరాబాద్-చెన్నై లైన్‌ను హైదరాబాద్, శంషాబాద్, భరత్ సిటీ, ఏపీలోని డచ్చిపల్లి, నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి (ఎయిర్‌పోర్టు), చెన్నై ఔటర్ రింగ్ రోడ్, చెన్నై స్టేషన్ల మీదుగా 760 కి.మీ.ల లైన్‌ను నిర్మిస్తారు. ఈ లైన్ ఏపీలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల గుండా వెళ్తుంది.

కార్యాచరణ ఇలా..

ఈ రెండు అత్యుత్తమ స్థాయి హైస్పీడ్ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణను రూపొందించాయి. తొలుత రైలు మార్గాల భూమి అనుకూల అలైన్‌మెంట్ గుర్తింపు, ఏ స్టేషన్లను నిర్మించాలి అనే దానిపై తుది నిర్ణయం తీసుకుంటారు. తర్వాత భూసేకరణ, అటవీ శాఖ భూమి క్లియరెన్స్ చేపడతారు. రైల్వే స్టేషన్ల నిర్మాణానికి 50 ఎకరాల చొప్పున భూమి సేకరణ, మౌలిక సదుపాయాల కోసం బ్లూప్రింట్ తయారీ, ప్రాజెక్టు సర్వే, నిర్మాణానికి సమన్వయం కోసం రైల్వే, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో నోడల్ టీంలను నియామిస్తారు.



మంత్రాలయ మఠం గోశాలలో గోవుకు ఆహారం అందిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

ఆలయాల్లో గోపూజ

బెంగళూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగలో భాగంగా బలిపాడ్యమిని పురస్కరించుకుని బుధవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలోని ఆలయాలలో బుధవారం గోపూజ నిర్వహించారు. ధార్మిక, సాంస్కృతిక పరంపరలో గోమాతకు విశేషస్థానం ఉందని రవాణా, దేవదాయశాఖల మంత్రి రామలింగారెడ్డి పేర్కొన్నారు. రాయచూరు పర్యటనలో ఉన్న డీసీఎం డీకే శివకుమార్ సరిహద్దున ఉండే మంత్రాలయంలోని రాఘవేంద్రమఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సతీసమేతంగా గోపూజ చేశారు. ఆవుకు స్వయంగా ఆహారం, పశుగ్రాసం అందచేశారు.

ధర్మస్థల ధర్మాధికారిగా వీరేంద్ర హెగ్గడే



బళ్లారి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మస్థల ధర్మాధికారిగా వీరేంద్ర హెగ్గడే నియమితులయ్యారు. భగవాన్ చంద్రనాథస్వామి బసది మంజునాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు జరిగే వేడుకల్లో తుమకూరులోని సిద్దిగంగ మఠానికి చెందిన సిద్ధలింగస్వామీజీ హాజరు కానున్నారు. ఎమ్మెల్యేలు హరీష్ పూంజా, కే. ప్రతాప్ సింహ నాయక్, మెస్కామ్ అధ్యక్షుడు కే. హరీష్ కుమార్ పాల్గొంటారు. సీనియర్ ఉద్యోగులను హెగ్గడే సత్కరించనున్నట్లు తెలిపారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రాయదుర్గం రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదని భార్యను హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. డీ. హీరేహాళ్ మండలం మురడి గ్రామంలో మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని హనుమంతరాయుడు తన భార్య నాగమణిని గొడ్డలితో నరికి చంపిన కేసులో అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మురడి గ్రామానికి చెందిన హనుమంతరాయుడు రాయదుర్గం మండలం టి.వీరాపురం గ్రామానికి చెందిన నాగమణిని పెళ్లి చేసుకున్నాడు. మద్యానికి బానిసై డబ్బులు ఇవ్వలేదని నిత్యం గొడవపడుతుండేవాడు. ఈ నెల 20న నిద్రపోతున్న భార్య నాగమణిని చంపేసినట్లు పోలీసుల ఎదుట నిందితుడు హనుమంతరాయుడు నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రాయదుర్గం సివిల్‌కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

ఎక్సైజ్ పోలీసులపై దాడి

- అల్లీపూర్ తండాలో తనిఖీలు చేస్తుండగా ఘటన
- కేసు నమోదు



గాయపడిన వెంకటనారాయణ

కదిరి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తనిఖీలకు వెళ్లిన ఎక్సైజ్ పోలీసులపై గ్రామస్థులు దాడిచేసిన ఘటన కదిరి మండలం అల్లీపూర్ తండాలో చోటు చేసుకుంది. కదిరి అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు బుధవారం నాటుసారా తయారు చేస్తున్నారన్న సమాచారంతో అల్లీపూర్‌తండాకు వెళ్లారు. గ్రామంలో రమణమ్మ ఇంట్లో సోదాలు చేస్తుండగా.. ఆమెతో పాటు గ్రామానికి చెందిన వెంకటేష్‌నాయక్, రవీనాయక్, మరికొంతమంది గ్రామస్థులు తమ గ్రామానికి వచ్చి తనిఖీలు చేస్తారా అంటూ తిరగబడి కట్టెలతో దాడి చేశారు. దాడిలో ఎక్సైజ్ కానిస్టేబుల్ వెంకటనారాయణ తలకు గాయమవ్వగా.. మరో కానిస్టేబుల్ వెంకటప్రసాద్‌కు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన కానిస్టేబుళ్లను కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలో భాగంగా గ్రామానికి వెళ్లిన ఎక్సైజ్ పోలీసులపై దాడికి పాల్పడ్డ రమణమ్మ, వెంకటేష్‌నాయక్, రవీనాయక్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థిని ఆచూకీ లభ్యం

రాప్తాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కనిపించకుండా పోయిన విద్యార్థిని అక్షితను పోలీసులు గుర్తించి, ఇంటికి చేర్చారు. మండలంలోని పంగల్‌రోడ్డు సమీపాన గల విన్సెంట్ డీపాల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న అక్షిత మంగవారం అదృశ్యమైన విషయం తెలిసిందే. దీనిపై కుటుంబ సభ్యులు రాప్తాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో రాప్తాడు సీఐ శ్రీహర్ష, పోలీసులు కొన్ని గంటల్లోనే విద్యార్థిని ఆచూకీ కనుగొన్నారు. హిందూపురంలోని ఆర్టీసీ కాలనీలో విద్యార్థిని ఉండగా.. సాంకేతికత సాయంతో ఆచూకీ కనుగొన్నారు. తెల్లవారుజామున 3 గంటలకు విద్యార్థిని వద్దకెళ్లి, క్షేమంగా రాప్తాడు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులకు అప్పగించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.83	1631.92
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	27,266	52,001
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,889	51,309
నీటి నిల్వ (టీఎంసీలు)	79.23	101.46

రామప్ప ఆలయానికి కార్తీక శోభ



ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

బళ్లారిరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తాలుకాలోని పరమదేవనహళ్లి గ్రామంలో వెలసిన రామప్ప ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది. ఆలయంలో దీపోత్సవ కార్యక్రమాన్ని అర్చకులు శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున తరలి వచ్చి దీపాలు వెలిగించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో దీపావళి పూజలు



పండుగ సందర్భంగా ట్రాఫిక్ జామ్

తోరణగల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకా వ్యాప్తంగా ఘనంగా దీపావళి పండుగను నిర్వహించారు. శ్రీ లక్ష్మీ అమ్మవారిని కొంతమంది వ్యాపారస్తులు 21వ తేదీ అమావాస్య వుండటంతో పూజలు ఆచరించారు. మరికొంతమంది 22వ తేదీకు శ్రీలక్ష్మీ అమ్మ వారిని పూజించారు. దీపావళి పండుగ సందర్భంగా కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిట లాడాయి. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మామూలు రోజులలోనే ఇక్కడ ఎక్కువగా ట్రాఫిక్ జామ్ జరుగుతూ వుంటుంది. పండుగ సమయంలో ఇది ఇంకా ఎక్కువగా వుంటుంది.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి పుట్టినరోజు



అల్లం ప్రశాంత్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న తిమ్మనగౌడ

బళ్లారిరూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ బళ్లారి జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన నివాసంలో బగురు అధ్యక్షులు, వ్యవసాయ పరికరాల సం ఘం అధ్యక్షుడు, సిద్దమ్మనహళ్లి తిమ్మనగౌడ ప్రశాంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రముఖులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోవాలి

సిరుగుప్ప, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషి పౌష్టికాహారం తీసుకోవాలని శిశు అభివృద్ధి యోజన అధికారి ప్రదీప్ తెలిపారు. సిరుగుప్ప పట్టణంలోని సాధన ఇంటర్నేషనల్ కళాశాలలో ఆహార మేళ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా శిశు అభివృద్ధి యోజన అధికారులు భావన, సాధన ఇంటర్నేషనల్ అధికారులు అమరేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షానికి నేలకొరిగిన వరి పంట

- చేతికొచ్చిన పంట కోల్పోయిన రైతులు
- నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం డిమాండ్



సిరిగేరి వద్ద నేలకొరిగిన వరి పంట

బళ్లారి సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణ, పరిసర ప్రాంతాల్లో మంగళవారం భారీ వర్షాలు కురిశాయి. దీంతో రైతులు సాగు చేసిన వరి పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలోని ఎం.సుగూరు, రుద్రపాద, నడకి, నిట్టూరు, హెరకల్లు గ్రామాల్లో సోనా మసూరి , ఆర్ఎస్ఆర్, గంగా కావేరి రకాల వరి కోతలు కొనసగుతున్నాయి. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరూర్ తాలూకా పరిధిలోని తెక్కలకోట, బైరాపూర్, దారుర్, బాల్కుండి, ఉప్పర హోసల్లి, హాళేకోట గ్రామాల్లో వరి పంట బాగా పండిందని, మంచి దిగుబడి వస్తుందని రైతులు ఆశతో ఉన్నారు. మంగళవారం గాలితో కూడిన వర్షం కారణంగా వరి పంట దెబ్బతింది. సిరేగేరి, కొంచెగేరి, దాసపూర గ్రామాలకు చెందిన చంద్రప్ప, శేషప్ప, తిమ్మప్ప, ఎర్రన్న సహ వందలాది మంది రైతులు వర్షానికి పంట దెబ్బతినిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీపావళి తరువాత పంటను కోద్దామని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది.



కంప్లి వద్ద నేలకొరిగిన పంట

కంప్లి(ఆంధ్రజ్యోతి): తాలూకాలో మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు చేతికొచ్చిన వరి పంటలు నేలపాలయ్యాయి. కురుగోడు, ఎమ్మిగనూరు, సిరిగేరి, దరోజీ, చుట్టుపక్కల గ్రామాల్లో అల్పపీడనం వల్ల కురుస్తున్న వర్షాలకు వరి పంటలు వేసుకున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యేక తుపాను ప్రభావంతో పంటలు పూర్తిగా నష్టపోతున్నామని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కారణంగా దిగుబడి కూడా పూర్తిగా తగ్గిపోతుంది. పంట కోసం పెట్టిన పెట్టుబడులే ఎక్కువవుతున్నాయని రైతులు తెలుపుతున్నారు. సొంత రైతులకు కొంతవరకు నష్టం వాటిల్లుతుంది. కౌలు రైతులు పూర్తిగా నష్టపోతున్నామన్నారు. వర్షానికి నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బీవీ గౌడ కోరారు.

సిరుగుప్ప, (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో వరి పంటకు నష్టం వాటిల్లింది. సిరుగుప్ప తాలుకాలో నది పరివాహక ప్రాంతాలు భారీ దెబ్బతిన్నాయి. రైతులు నష్టాలపాలయ్యారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో పాత ఇల్లు కూలిపోయి భారీ నష్టం వాటిల్లింది. ప్రభుత్వాలు తమకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు.



సిరిగుప్పలో నేలవాలిన పంట



వర్షానికి కూలిన ఇల్లు

సహకార ఎన్నికలు ఏకగ్రీవం

కంప్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తాలుకా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సహకార సంఘం ఏకగ్రీవంగా ఎన్నికైందని ఎన్నికల అధికారి రాము తెలిపారు. 13 మంది సభ్యులను గ్రామీణ ప్రాథమిక కృషి పత్తిన సహకార సంఘం సభ్యులు నలుగురు, కంప్లి వ్యవసాయ మార్కెట్ నుంచి ఎనిమిది, ప్రభుత్వ నామినేటెడ్ ఒకరు మొత్తం 13 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కంప్లి వ్యవసాయ ఉత్పన్న మార్కెట్ ఎనిమిది మంది స్థానాలకు 29 మంది నామినేషన్లు వేశారు. పెద్దల సమక్షంలో చర్చల అనంతరం 21 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఎనిమిది మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇందులో గ్రామాల సొసైటీ ద్వారా వచ్చిన వారిలో కడేమని నాగరాజు, రాము, దొడ్డ బసప్ప, అల్లి నాగరాజు, చొక్కారావు ఉన్నారు. కంప్లి నుంచి అరలి ముత్తయ్య, హనుమంతప్ప, కురుబ నాగరాజు, రామాంజనేయులు, గౌడ అంజనప్ప, భాస్కర్‌రెడ్డి, అయ్యమ్మ, రాధా వారితో పాటు ఒక్కరు ప్రభుత్వ నామినేటెడ్ సభ్యుడిగా బలాపురం లింగప్ప ఎన్నికయ్యారు. ఎన్నికైన వారికి నాయకులు అభినందించి సన్మానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మున్సిపల్ అధ్యక్షులు బట్టాప్రసాద్, బీడీసీసీ బ్యాంకు జిల్లా సభ్యులు మూకయ్య స్వామి, కౌన్సిలర్ డాక్టర్ వీఎల్ బాబు, రామాంజనేయులు, హళ్లల్లి వీరేష్, కడేమనే పంపాపతి, నారాయణప్ప, మరేగౌడ, బీవీ గౌడ, వెంకట రామరాజు, శీనప్ప, హోసకోటి జగదీష్, ఇటిగి బసవరాజు, శివప్ప నాయక్ కార్యదర్శి వీరేష్ పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన కంప్లి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సహకార సంఘం సభ్యులు

తమలపాకు సాగే వారికి జీవనాధారం

- మూడు దశాబ్దాలుగా సాగు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తమలపాకు అనేది ఆధ్యాత్మికంగా, వైద్యపరంగా, వస్తువరంగా ఎంతో ప్రాధాన్యం కలిగినదిగా పరిగణిస్తారు. శాస్త్రీయ తీగజాతికి చెందిన ఈ ఆకు తేమ, వేడిప్రదేశాల్లో బాగా పెరుగుతుంది. గుండె ఆకారంలో నిగనిగలాడుతూ ఉండే తమలపాకుకు దక్షిణాసియాలో బీటల్, బెరుయి తదితర పేర్లతో పిలుస్తారు. తమలపాకులు లేకుండా పూజలు, ప్రతాలు పూర్తికావు. ఇది దేవతలకు తాంబూలం రూపంలో హిందువులు అర్పిస్తారు. వాస్తు ప్రకారం ఇంట్లో తమలపాకు మొక్కను పెంచితే ధనలాభం, ఆర్థిక కష్టాలు దూరమవుతాయని పూర్వీకులు చెబుతుంటారు. అలాంటి హిందూ సంప్రదాయల్లో అత్యంత ప్రముఖ స్థానం సంపాదించుకున్న తమలపాకు ఎంతోమంది రైతుల జీవితాల్లో వెలుగులు నిలుపుతోంది. ఎన్నో కుటుంబాలు ఈ పంట సాగుపై ఆధారపడి జీవిస్తున్నారు. ఉద్యాన పంట కాకపోయినా అధికవర్షపాతం, వేడి ప్రాంతాల్లో సాగుకు అనుకూలంగా ఉంటుంది. అన్ని సీజన్‌లలో ఆర్థికంగా ఆదుకుంటుందని రైతులు చెబుతున్నారు. కొప్పళ జిల్లా కుష్టిగి తాలూకా హిరేమన్నపుర గ్రామానికి చెందిన ఓ కుటుంబం మూడు తరాలుగా తమలపాకును పండిస్తూ జీవనోపాధి పొందుతుండడం విశేషం. ఇతర పంటలతో రైతులు నష్టపోయినా, తాము నమ్ముకున్న తీగను తాము వదలుకోలేదని అంటున్నారు. మూడు దశాబ్దాల క్రితం తమలపాకు సాగును కుటుంబంలో పెద్దవాడైన దొడ్డప్ప విజయగాథ డాక్టర్ రాజ్‌కుమార్ నటించిన బంగారు మునుష్య సినిమాలోని సన్నివేశం గుర్తు చేస్తుంది. పెద్ద పెద్ద రాళ్లు, ముళ్లకంపలతో నిండిన భూమిలో యంత్రాలు లేనిరోజుల్లో కష్టపడి పనిచేసిన దొడ్డప్ప తన కుటుంబ సభ్యులతో కలిసి దానిని చదును చేసి పంటసాగుకు అనుకూలంగా మలిచారు.



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేసిన తమలపాకు కట్టలు

తమలపాకు సాగు అంత సులభం కాదు
-దొడ్డప్ప, రైతు

తమలపాకు సాగు అంత సులభం కాదు. ఆకుచేతికొచ్చే వరకు తీగను జాగ్రత్తగా చూసుకోవాలి. శీతాకాలం, అధిక వర్షం, మంచు ఎక్కువగా కురుస్తున్న సమయంలో తమలపాకుకు కూడా వ్యాధులు సోకుతాయి. ప్రస్తుతం ధర తక్కువగా ఉంది. దీపావళి తరువాత ఆకు దిగుబడి తగ్గుతుంది. వారానికి నాలుగు సార్లు కోతలు కోస్తాం. ఈ పంట సాగుపై ప్రస్తుతం ఖర్చు పెరిగింది. బ్రోకర్ల వద్దకు వెళితే నష్టాలు వస్తాయని నేరుగా కస్టమర్లను వెతుక్కుని వారికి విక్రయిస్తున్నాం.



బస్సును తోస్తున్న ప్రయాణికులు

ముందుకు కదలని బస్సు..

కంప్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): హోస్పేట, కంప్లి కేఎస్ఆర్టీసీ సిటీ బస్సు మొరాయించింది. బుధవారం ఉదయం కంప్లి బస్టాండ్‌లో హోస్పేట డిపోకు చెందిన బస్సు స్టార్ట్ అవ్వలేదు. చివరకు ప్రయాణికులు బస్టాండ్‌లో డ్రాప్ చేయడానికి వచ్చిన స్థానికులు బస్సును నెట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. కేఎస్ఆర్టీసీ అధికారులు మొరాయించే బస్సు సర్వీసులు నడపకుండా కండీషన్‌లో ఉన్న బస్సులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ కవితా మన్నికేరి



మాట్లాడుతున్న కలెక్టర్ కవితా మన్నికేరి

బళ్లారి సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వంట సిలిండర్ల భద్రతా ప్రమాణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని విజయనగరం జిల్లా కలెక్టర్ కవితా మన్నికేరి అన్నారు. వంట గ్యాస్ సిలిండర్లను పంపిణీ, నిల్వ చేసే గ్యాస్ ఏజీన్సీల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అత్యవసర సమయాల్లో వంట సిలిండర్లు వాడే గృహ వినియోగదారులు 1904 టోల్ ఫ్రీ నంబర్‌ను ఉపయోగించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. వినియోగదారుల నుంచి ఏవైనా ఫిర్యాదులు వచ్చిన వెంటనే ఘటనా స్థలానికి వెళ్ళి సమస్యను పరిష్కరించాలన్నారు. ఏజెన్సీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుక్ చేసుకున్న 48గంటల్లోపు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని ఆదేశించారు. జిల్లాలో గృహ సిలిండర్ల కొరతను నివారించేందుకు తగినంత సరఫరా ఉండేలా చేసుకోవాలన్నారు. ఉజ్వల పథకం లబ్ధిదారుల ఈ-కేవైసీని తప్పనిసరి చేయాలన్నారు. గృహ వినియోగదారుల భద్రతా నియమాలు(ఎస్‌ఏపీ) ముద్రించామన్నారు. ప్రతి సిలిండర్‌తోపాటు వారి ఇళ్లకు సరఫరా చేయాలన్నారు. ఆహార, పౌర సరఫరాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రియాజ్ మాట్లాడుతూ గృహ సిలిండర్ వినియోగదారులు గ్యాస్ స్టవ్ పైపును తరచుగా మార్చాలన్నారు. అధీకృత గ్యాస్ సరఫరాదారుల నుంచి మాత్రమే గ్యాస్ కొనుగోలు చేయాలన్నారు. ఇటీవల తాలూకాలోని గాదిగనూరు గ్రామంలో జరిగిన సిలిండర్ పేలుడు ఘటనతోనైనా మేల్కోవాలన్నారు.

నిస్వార్థ సేవకు నిజమైన గుర్తింపు

- ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్



జ్యోతి వెలగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

రాయచూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పార్టీని బలోపేతం చేసే దిశగా ప్రతి కార్యకర్త నిబద్ధతతో నిస్వార్థంగా పని చేయాలని ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌సూచించారు. పని చేసిన ప్రతియొక్కరికి పార్టీ గుర్తింపునిస్తుందని కొంత ఆలస్యం జరిగినా తప్పని సరి గుర్తింపు లభిస్తుందన్నది ప్రతియొక్కరు నమ్మవల్సిన విషయమని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన డీసీఎం డీకే శివకుమార్ రాయచూరు తాలూకాలోని గాణదాళ పంచముఖి అంజనేయ స్వామి దేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన డీసీసీ కీలక సమావేశంలో డీకే శివకుమార్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, వ్యక్తి ఆరాధనకంటే పార్టీ ముఖ్యమన్న విషయాన్ని ప్రతియొక్కరు గుర్తించుకోవాలన్నారు. సమాజసేవ పట్ల నిబద్ధత ఉన్న వారిని పార్టీతో సహ సమాజం మొత్తం గుర్తిస్తుందని ఇందుకు హనుమాన్ దేవుడే సాక్ష్యమన్నారు. రాముడు, దశరతుడికంటే కూడా అంజనేయుడిని పూజించే వాళ్లే ఎక్కువని నిస్వార్థపరులు సేవాభావ తత్పరతకు నిదర్శనమైన హనుమాన్‌ను ప్రతియొక్కరు దైవంగా పూజించేది అందుకేనని కార్యకర్తలకు హితవుపలికారు. కాగా పలు సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం పట్ల వివక్ష చూపుతుందని నిజంగా రాష్ట్రాభివృద్ధి పై బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే కేంద్రం పై ఒత్తిడి తెచ్చేందుకు తమతో కలిసి రావాలని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కోరారు. ప్రజాసంక్షేమం కోసం తమ ప్రభుత్వం ప్రతి ఏటా లక్ష కోట్ల రూపాయిలు కేటాయిస్తుందని ఈ సందర్భంగా డీకే శివకుమార్ తెలిపారు. అధికారంలో కూర్చిన మరుక్షణమే ఎన్నికల్లో ఇచ్చిన ఐదు గ్యారెంటీల అమలుకు కట్టుబడి ఉన్నట్లు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వివరించారు. తొలి మంత్రివర్గ సమావేశంలోనే ఈ రకమైన కీలక నిర్ణయం తీసుకోవడం ద్వార ప్రజాభిద్యోయం పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న నిభదకథతను చాటామన్నారు.

'ఓట్ చోర్.. గద్ది చోడ్'పై కాంగ్రెస్ వినూత్న ప్రచారం

రాయచూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా హట్టి బంగారు గని క్యాంప్, పట్టణంలో యువ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం 'ఓట్ చోర్ గద్ది చోడ్(ఓట్ల దొంగలు కుర్చీ ఖాళీ చేయండి) అనే నినాదంతో సంతకాల సేకరణ ప్రచారం చేశారు. లింగసుగూరు బ్లాక్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఓట్ల రిగ్గింగ్ గురించి ప్రజలకు అవగాహన కల్పించి సంతకాలను సేకరించారు. బీజేపీ ఎన్నికల సంఘాన్ని దుర్వినియోగం చేసి, మోసపూరిత మార్గాల ద్వారా అధికారంలోకి రావడానికి ఓటర్ల జాబితాను తారుమారు చేసిందన్నారు.



సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ కార్యకర్త

హోసూరు జోన్

నిరాశ కలిగించిన బెంగళూరు మెట్రో రైలు ప్రకటన

- సాంకేతికంగా సాధ్యం కాదని నివేదికలో వెల్లడి

హోసూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజధాని బెంగళూరు - హోసూరు నగరాల మధ్య మెట్రో రైలు ప్రాజెక్టు సాంకేతికంగా సాధ్యం కాదని బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎంఆర్‌సీఎల్) బుధవారం చేసిన ప్రకటన ప్రజలను నిరాశపరిచింది. బెంగళూరు నుంచి హోసూరులోని కర్మాగారాలకు, ఇతర సంస్థలకు ప్రతిరోజూ వేలాది మంది కార్మికులు ప్రయాణిస్తున్నారు. హోసూరు-బెంగళూరు కేవలం 40 కి.మీ దూరంలో ఉన్నప్పటికి రెండు రాష్ట్రాల మధ్య రహదారిపై భారీ ట్రాఫిక్ అంశం తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితిలో దక్షిణ భారతదేశంలోని రెండు రాష్ట్రాలను బెంగళూరు, హోసూరు మధ్య కలిపే మొదటిమెట్రో రైలు ప్రాజెక్టును ప్రాంరంభించడానికి చెన్నై మెట్రో రైలు పరిపాలనా విభాగం, బెంగళూరు మెట్రో రైలు పరిపాలనా విభాగం సంయుక్తంగా అధ్యయనం చేశాయి. అలాగే ఈ ప్రాజెక్టు కోసం మార్గం రైల్వే స్టేషన్లు మొదలైన వాటికి సంబంధించి ముసాయిదా ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ తరుణంలో బీఎంఆర్‌సీఎల్ కర్ణాటక ప్రభుత్వానికి ఒక నివేదికను సమర్పించింది. సాంకేతిక కారణాల వల్ల బెంగళూరు-హోసూరు మధ్య మెట్రో రైలు ప్రాజెక్టు సాధ్యం కాదని పేర్కొంది. దీని కారణంగా ప్రజలు ఆశించినప్పుడు మెట్రో రైలు ప్రాజెక్టును వదిలివేయడం పట్ల రెండు రాష్ట్రాల కార్మికులు, ప్రజలు నిరాశ చెందుతున్నారు. బెంగళూరు మెట్రో అన్ని మార్గాల్లో 750 వోల్ట్ డీసీ ఓవర్ హెడ్ కేబుల్ సౌకర్యాలపై రైళ్లను నడుపుతోంది. బొమ్మసంద్ర నుంచి అత్తిబెలె మార్గంలో ఒకే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడానికి ఒక ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేశారు. కానీ చెన్నై మెట్రో 25 కేవీ ఏసీ ఓవర్ హెడ్ కేబుల్ సౌకర్యాలపై రైళ్లను నడుపుతోంది. హోసూరు - బొమ్మసంద్ర మధ్య 23 కి.మీ దూరానికి ఒకే సాంకేతిక పరిజ్ఞానాన్ని నిర్వహించడానికి ఒక ప్రాజెక్టు నివేదికను సమర్పించారు. రెండు ఓల్టేజ్ స్థాయిలలో వ్యత్యాసం కారణంగా రెండు సాంకేతికతలను కలపడం సాంకేతికంగా సాధ్యం కాదని నివేదికలో పేర్కొన్నారు. ఈ అంశంపై తుది నిర్ణయం రెండు రాష్ట్ర ప్రభుత్వాలే తీసుకుంటాయని ఇరు రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు తెలిపారు.

నగరంలో వర్షం.. ట్రాఫిక్‌కు అంతరాయం

హోసూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరం, చుట్టుపక్కల ప్రాంతాలలో బుధవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి భారీ వర్షం కురిసింది. భారీ వర్షాల కారణంగా హోసూరు నగరంలోని అనేక లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధానంగా హోసూరు బస్టాండు, సమీపంలోని ఫ్లైఓవర్ క్రింద ఉన్న ప్రాంతం, ఇతర రహదారులపై వర్షపునీరు నిలిచింది. దీంతో ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగేందుకు అంతరాయం నెలకొంది. వర్షాకాలంలో రోడ్లపై వర్షపు నీరు నిల్వ కాకుండా మున్సిపల్ కార్పొరేషన్ తగిన చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు